

## రేగులపాటి కిషన్‌రావు

దుర్గరాజు దుఃఖిస్తున్నాడు. అతనికి తల్లిదండ్రులు పెట్టిన పేరు దుర్గయ్య. ఓసారి నాటకంలో రాజు వేషం వేసిండు. అప్పటినుండి అతన్ని దుర్గరాజు అని పిలుస్తున్నారు.

రాళ్ళు విసిరికొట్టి, మట్టిని వాకిలినిండా వెదజల్లి, తొడుక్కున్న అంగీని చింపుకొని, వెర్రి నవ్వులు నవ్వుతూ, వెకిలిగా ఎగురుతూ, నెత్తినోరూ కొట్టుకుంటూఏడుస్తూ, ఎవరెవరినో బండబూతులు తిడుతూ కోతిలా ఎగునేతూ, అలసిపోయి సొమ్మసిల్లి నేలమీదపడిపోయి నిదురలోకి జారుకున్న ఇరవైరెండేళ్ళ కొడుకును చూసి దుర్గరాజు కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

ఇరవై ఏడు సంవత్సరాలక్రితం దుర్గరాజుకు మంకమ్మకు పెళ్ళయింది. అప్పటికే అతని తల్లిదండ్రులు రోగగ్రస్థులై పనిచేయలేక చతికిలబడిపోయి నడి వయస్సులోనే ముసలివాళ్ళలాగ తయారయ్యారు. తండ్రికి కంటిచూపు తగ్గిపోయింది. తల్లికి కీళ్ళ నొప్పులు ఇద్దరూ పూర్తిగా కొడుకుమీదనే ఆధారపడే పరిస్థితికి చేరుకున్నారు.

దుర్గరాజు రోజంతా కూలీ పనిచేసి వచ్చి సాయంత్రం చీపుర్లు కట్టడమో, తాళ్ళు అల్లడమో, నులక తాడు పేనడమో, నులకమంచాలు నేయడమో, చేస్తుండేవాడు. చుట్టుపక్కల మగాళ్ళు కల్లుతాగడానికి ఈదులల్లకు పోయినా ఇతడు మాత్రం ఇల్లు దాటేవాడు కాదు. పనివదిలేవాడు కాదు.

పనిలో నేర్పు, పట్టుదల ఉన్నమనిషి. తల్లిదండ్రులను కనిపెట్టుకొని వాళ్ళకు సేవలు కూడా చేస్తుండేవాడు. అతని మంచితనాన్ని ఊళ్లో చాలామంది తెలిసినవాళ్ళు పొగిడేవాళ్ళు.

కులానికి మాదిగ అని కొందరు చిన్నచూపు చూసినా, బుద్ధిమంతుల దృష్టిలో అతడు బుద్ధిమంతుడనే పేరు పొందాడు. గుణములోనే కాదు... రూపములో కూడా అందగాడే. మంచి బట్టలు కట్టబెడితే దొరబాబులా ఉంటాడని దొరలు కూడా అనుకునేవాళ్ళు.

దుర్గయ్యది మానేరుకు దక్షిణాన ఉన్న చింతల్‌ఠాణం గ్రామమే. ఆ వాగు నీళ్ళే ఆ ఊరికి అన్ని విధాల ఆధారం. ఏటి కాలువలతోనే ఊరిపొలాలు సాగయ్యేవి. వాగునీరు చేరని చోటికి మోటబావుల నీళ్ళతో మొక్కజొన్న, మిరప, కూరగాయలు పండించేవాళ్ళు ఊరివాళ్ళు. కూలి చేసుకొని బ్రతికేవాళ్ళకు, కులవృత్తులతో బ్రతికే వాళ్ళకు సంవత్సరం పొడవునా పనులు దొరుకుతూ ఉండేవి.

ఈ ఊరుకు మరో ప్రత్యేకత ఉంది. వర్షాకాలం మానేరు వాగు ఆ ఒడ్డుకు ఈ ఒడ్డుకు ఒరుసుకొని పారేది. అప్పుడు ఏటి కాలువగుండా చింతలకుంట, బుగ్గవోయిని కుంట, కొత్తకుంట నింపుకునేవాళ్ళు. వేసవి కాలపు పంట ఈ చెరువుల నీటితోనే పండేది. ఖరీఫు కాలంలో ఊరి చుట్టూ పచ్చని పొలాలతో గ్రామలక్ష్మి తన ఒంటి చుట్టు పచ్చచీర కట్టుకున్నట్టే అనిపించేది.

గుట్టలమీదికి వెళ్ళి చూచినోళ్ళకు మోటబావులున్నోళ్ళు మొక్కజొన్న, మిరప, కూరగాయలు పండించేవాళ్ళు.

మామిడితోటలు సమృద్ధిగా కాస్తుండేవి. జామ, నిమ్మ, సంత్రాలు, సపోట, కొబ్బరి కొంచెం కొంచెం పండుతుండేవి. ఆ రోజుల్లో భూములున్నోళ్ళే కాదు అన్ని వృత్తులవాళ్ళు, రైతు కూలీలు ఊరువదలకుండా వలసవెళ్ళకుండా ఊళ్ళో బ్రతికేవాళ్ళు.

జనాభా పెరగడం, చెట్లు తరగడం, వర్షాలు క్రమ క్రమంగా తగ్గిపోతున్న దశలో బావుల సంఖ్య పెరిగింది. అయినా నీటి కొరత తీరలేదు. పంటలు తగ్గిపోయాయి. మస్కట్, దుబాయి, సౌదీలాంటి దేశాలకు వలసలు పెరిగాయి. దుర్గయ్య మిత్రులు కిట్టయ్య, మల్లయ్య, ఎల్లయ్య, రాజనర్సు అలా ఇరవైమందికిపైగా అరబ్బు దేశాలకు బతకపోయింగ్రు. దుర్గయ్య మాత్రం ఊరువదలలేదు. చిన్నచిన్న సంపాదనలతోనే సంతృప్తిపడే మనస్తత్వం ఆయనది.

ఊరుకు దక్షిణాన చంద్రవంక ఆకారంలో రకరకాల పేర్లతో గుట్టలున్నవి. వాటిమీద సింతపలక చెట్లు, నర్రెంగచెట్లు, రాలె చెట్లు, పాలకొడిశె చెట్లు, జిట్రేగు చెట్లు, వేపచెట్లు ఇంకా పేరు తెలిసినవి, తెలియనివి ఎన్నో ఉండేవి.

వ్యవసాయదారులు చెట్ల కొమ్మలను, రెమ్మలను నరికి కట్టలుకట్టి గుట్టకిందికి మోసి తెచ్చి కచ్చరములో దున్నిన పొలం వద్దకు చేర్చి పొలములో వాటిని పరచి తొక్కేవాళ్ళు. ఆచెట్ల ఆకులు సేంద్రియ ఎరువుగా మారి పొలాలు ఏపుగా పెరిగేవి. రసాయనిక ఎరువుల వాడకం పెరగడం, చెట్లు సంఖ్య తరిగిపోవడంతో రైతులు ఆ పద్ధతిని వదిలేశారు.

ఊరోళ్ళు పొయ్యిలకట్టెలకోసం గుట్టలమీద ఆధారపడ్డవాళ్ళు, తెనుగోళ్ళు తేనె తొట్టెలు సేకరించి, తేనెను కలిగిన వాళ్ళకు అమ్మి డబ్బు సంపాదించే వాళ్ళు. సింతపలక కాయలు విరగగాసేవి గుట్టలకు. అందరూ ఆ కాయలు సేకరించి మాగేసి తినేవాళ్ళు. తెనుగోళ్ళు గంపలలో నింపుకొని సిరిసిల్లకు పోయి అమ్ముకొని అవసరమున్న వస్తువులు కొనుక్కొని వచ్చేవాళ్ళు. యుక్తవయసులో ఉన్నవాళ్ళు రాత్రిపూట వేటకు వెళ్ళేవాళ్ళు.

ఓసారి దుర్గయ్య పెళ్ళికాకముందు సోపతిగాళ్ళ తోటి గుట్టలకు రాత్రిపూట షికారుకు పోయిండు. ఓ కుందేలు దొరికినట్టే దొరికి తప్పించుకుపోయింది. ఉడుములుగానీ, ఏదులుగానీ తారసపడలేదు.

అడవి పంది కనిపిస్తే బాగుండేది. వేటాడితే అందరికీ పుష్కలంగా సరిపోయ్యేది దాని మాంసం అనుకున్నారు. కాని పంది కాకుండా చిరుతపులి కనిపించడంతో దుర్గయ్యతోపాటు అందరూ ప్రాణభయంతో చెట్ల చాటుకు వెళ్ళిదాక్కున్నారు. పులి తిండికోసం అన్వేషిస్తూ దూరంగా వెళ్ళడంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని అందరూ ఊళ్ళోకి వచ్చేశారు.

ఆ తర్వాత వారం పదిరోజులకు దుర్గయ్యను చూడటానికి చీర్లవంచ నుండి మంకమ్మ తండ్రి పెళ్ళిపెద్దలతో వచ్చిండు. పిల్లవాడు నచ్చడంతో, సంబంధం కుదరడమేమిటి, అదే నెలలో పెళ్ళికావడమేమిటి అన్నీ జరిగిపోయాయి.

మంకమ్మ బుద్ధిమంతురాలే. ఇంటి పనులన్నీ

## 'మాతృ'భాష

మనిషికి 'శ్వాస' వంటిదే మాతృభాష
శ్వాసించితేనే మనిషి బ్రతుకు
భాషించితేనే భాష బ్రతుకు
తల్లిపాలలో రంగరించిన భాష
తల్లి ఒడిలో పలకరించిన భాష
మనలను కని-పెంచిన భాష
మనలను కనిపెట్టి వుండు భాష
మన మాతృభాష!
జన్మ ఇచ్చిన భాష - జనని ఇచ్చిన భాష
జన్మ జన్మలందు మరువరాదు
మన మాతృభాష
మాతృభాషా ద్వేషం మహాపాపం
మాతృభాషను మరచుట మహాశాపం
బంధుమిత్రుల భాష - మన ఊరి భాష
మన మెట్ట-మాగాణుల మట్టి సువాసన
మన మాతృభాష
మన అమ్మభాష అమ్మమ్మ భాష
నాయన భాస-నాయనమ్మ భాష మాతృభాష

బి.ఎం.పి.సింగ్

## ఒక్కడే శ్రీశ్రీ

శ్రీలెందరో దేశంలో
శ్రీశ్రీ మరి ఒక్కడే
పేపరులో పోయెను శ్రీ
మిగిలెనొక్క శ్రీశ్రీ
శ్రీశ్రీ కాదొక వ్యక్తి
అనడం పునరుక్తి
నవలోకం కనిపెట్టిన
అతడనంత శక్తి

## వెండినాణెం

రాత్రి పనిచేసే
ఆకాశ టంకశాలలో
పక్షం రోజుల పాటు
రోజుకో వెండినాణెం
పగలు కానం

## కంపు-యింపు

శ్రీశ్రీ తాగి అయితే ఏం-కంపు?
అతని కవిత్వం మాత్రం యింపు
శ్రీశ్రీ తాగి పారేసిన సీసాలు మర్చిపో
అతని కవిత్వం చదివి రెచ్చిపో!

## ఇల్లు

ఇప్పుడు
ప్రతి ఇల్లు
ఒక సినిమా హాలు
ఒక నాటక శాల

## కాలం

కాలం కృష్ణుడు
కోకలెత్తుకెళ్ళాడట
బోరుమన్నాయి బోసిగా
తరువుల తరుణులు

మాధవీ సనారా

ఊడ్వడం, చల్లడం, అలకడం, బోళ్ళు తోమడం, వంట చేయడం, అందరి బట్టలు ఉతకడం, అత్తమామలకు సేవలు చేయడం అన్నీ చకచకా చేస్తూ ఉండేది. కూలి పనికి వెళ్ళినప్పుడు నాట్లు వేయడంలోనూ, కోతలు కోయడంలోనూ, యజమానులు మెచ్చేలా పనులు చేసేది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాక అన్ని పనులు చేసేది. భోజనాలయ్యాక పడకమీదికి చేరేది.

అలా సంవత్సరం గడిచిందో లేదో బిడ్డను కనడానికి మంకమ్మ పుట్టింటికి పోయింది. మొదటి కానుపు మంత్ర సాని చేతి చలువవల్ల ఎలాంటి ఇబ్బంది కలుగ కుండా మొదటి కూతురు భూదేవి పుట్టింది. దుర్గరాజు లాగే అమ్మాయి అందంగా ఉందన్నారు అమ్మలక్కలు.

భూదేవికి నెలరోజుల వయస్సు వచ్చిందో లేదో మంకమ్మ అత్తవారింటికి వచ్చింది. అత్తమామలు చాలా సంబరపడిపయారు. మంచములో నుండే దీవెనార్తి అందించారు.

మంకమ్మ మూడు నాలుగు వారాలు ఇంటివద్దనే ఉంటూ చిన్న చిన్నపనులు చేస్తూ, వంట చేస్తూ, అత్త మామలకు సేవలు చేస్తూ గడిపింది. ఆమె తీరిక సమ యంలో నులకతాడు పేనడం, చీపురు కట్టల కట్టడం, చేస్తూనే ఉంది. ఆ విధంగా దుర్గయ్యకు ఆపనిలో సహాయపడడం నేర్చుకుంది.

అత్తమామలకు జబ్బు ముదిరిపోవడంతో ఇరవై రోజుల భేదంతో ఇద్దరూ... ఈలోకం వదిలివెళ్ళి పోయారు. అత్తమామలకు సేవచేసే పని తగ్గిపోయినా, వాళ్ళు లేని లోటు బాధనే మిగిల్చిపోయింది మంక మ్మకు. ఎటు తిరిగినా అత్తనే జ్ఞాపకం రావడంతో కంట నీరు పెట్టుకునేది.

మంకమ్మ మళ్ళీ వ్యవసాయ పనులకు వెళ్ళసాగింది. పనిలో మధ్య ఒకసారి బిడ్డకు పాలివ్వడానికి వచ్చేది.

రెండు, రెండు సంవత్సరాల తేడాతో మరో ఇద్దరు జన్మించారు. వాళ్ళే రేణుక, దేవయ్య. మగపిల్లవాడు

పుట్టాడని భార్యాభర్తలు తెగ మురిసిపోయారు. ఆ పిల్లవాడు దొరబాబులా ఉన్నాడు. ఆ మాట ఇరుగు పొరుగువాళ్ళు అన్నప్పుడు ఆ దంపతులు తెగ సంబర పడేవారు.

❖ ❖ ❖

ఇద్దరు కూతుళ్ళు వ్యవసాయ పనులు చేయనేర్చు కున్నారు. సంపాదన పెరగసాగింది. దేవయ్యను చదివిం చాలని కొన్నాళ్ళ క్రితం బడికి పంపించారు. వానికి చదు వులో శ్రద్ధలేదు.

తండ్రికొనిచ్చిన పలక, బలపం బడి లోనే వదిలేసి ఆకతాయి పిల్లలతో సిర్రగోనె, చెమ్మడిగిద్ది, తొక్కుడు బిళ్ళతోపాటు, ఆటలు ఆడడం తర్వాత చెట్టెక్కి చింత కాయలో, జామకాయలో, రేగుపళ్ళో, మామిడి కాయలో తెంపుకొని తినడం, కావలివాడు వస్తే, అది లిస్తే పిక్కబలం చూపించి పరుగులు తీయడం, చింత చెరువులో స్నానాలు చేయడం, సాయంత్రం పొద్దు గుంకేవేళ ఇంటికి చేరడం, తల్లిదండ్రులు మందలిస్తే మంచములో పడుకొని దుప్పటికప్పుకోవడం, రాత్రి అయ్యాక తల్లిలేపి తిండిపెడితే తిని పడుకోవడం, అలా దేవయ్య పది పన్నెండేళ్ళవాడయ్యాడు.

ఇలా అయితే లాభంలేదని రాజేంద్రబాబు వద్ద ఎడ్లకాపరిగా కుదిర్చాడు. తోటివాళ్ళుకూడా కొందరు వేర్వేరు యజమానుల ఎడ్లను కాస్తుండడంవల్ల వాళ్ళం దరి భూములు ఊరుకు దక్షిణాన గుట్టలవద్ద ఉండడం వల్ల పోయేటప్పుడు, వచ్చేటప్పుడు కలిసివెళ్ళేవాళ్ళు, కలిసి వచ్చేవాళ్ళు.

వీళ్ళు ఎడ్లు మేపేచోట గడ్డిదట్టంగా ఏపుగా పెరిగేది. అక్కడ సింత పలకచెట్లు, మోదుగు చెట్లు, జిట్టిరేగు చెట్లు, తంగేడు చెట్లు కూడా ఉండేవి.

రాజేంద్రబాబు గుడ్డం మధ్యనుండి ఒక ఒర్రె వానా కాలం గలగలపారుతూ ఉండేది. ఆ ఒర్రెలో ఉన్న ఇసు కతో ఎడ్లకాపర్లు పిచ్చుక గూళ్ళు కట్టేవాళ్ళు. తూనీగలు పట్టి దారంకట్టి ఆడడం బంగారు పురుగులను పట్టి, దారం కట్టి అగ్గిపెట్టెలో పెట్టడం, దానికి ఆహారంగా బంతాకులు అగ్గిపెట్టెలో చేర్చడం, దాగుడు పుల్లలు ఆడడం, నీటిలో స్నానాలు చేయడం, చెలిమలు తోడి

## నానో కవితలు

**వ్య**సనం
జేబుకు చిల్లు
జీవితం చెల్లు
దోమ
తీస్తుంది రాగం
తెస్తుంది రోగం
లంచంపై కళ్ళు
కదలవు ఫైళ్ళు
అవకాశం
రాదు సదా
ఆదమరిస్తే వృథా
భయపెట్టిన
భావి
వేసుకోమన్నది ఉరి
మనసున్న మనిషి
సర్వజనం హితైషి
అందం
కోసం విగ్గు
ఆనందం కోసం పెగ్గు
బుల్లి తెర
నట్టింట్లో
బంధాలన్ని
నట్టేట్లో
పెరిగిన సైన్సు
తరిగిన సెన్సు
గుండెల్లో బాధ
కన్నుల్లో ధార

కొమ్మినేని సుధారాణి

## మహాప్రస్థానమై!...

మెత్తదనంలోంచి కొత్తదనాన్ని తీసుకురావాలని
మత్తుదనంలోంచి ఉత్తుంగతరంగమై లేవాలని
సుత్తిగా మారాడు! కొడవల్లై నిలిచాడు!
వెరసి అరుణపతాకంలో ధ్రువతారగా ఎదిగాడు
కలకానిదీ విలువైనదీ బ్రతుకని
దాన్ని కన్నీటిధారలలో బలిచేయొద్దని
శ్రమశక్తిని వెన్నుతట్టాడు
దోపిడీ వర్గంపై విరుచుకుపడ్డాడు
శ్రామిక విలువంటే జనతకు తెలిపాడు
వెరసి శ్రామిక వర్గ రథసారథిగా నిలిచాడు
జీవితంలోఎంతో ఎదిగాడు
ఎరిగి ఎదిగి ఒదిగి ఎంతో అలిసాడు
అందుకే తన మాటల్లో తన పాటల్లో తన బాటలో
తన కవితల్లో అందరినీ సదాపయనింప చేస్తూ
జాతికి జీవంపోస్తూ
తాను మాత్రం సేద తీరాలని
మరలిరాని అనంత లోకాలకు పయనమయ్యాడు
కడకు తానో మహాప్రస్థానమై నిలిచాడు!

**దోసపాటి సత్యనారాయణమూర్తి**

నీళ్ళు త్రాగడం, సీతాఫలాలు తెంపుకొని కట్టెలె ఏరి తెచ్చి మంట అంటించి కాల్చుకొని తినడం, అలా రోజులు గడిచిపోతున్నాయి.

ఓరోజు దేవయ్య పక్కనున్న చేనులో పెసరకాయలు, మరో పిల్లవాడు బబ్బెరకాయలు, ఒకడు కంకులు, ఒకడు పల్లికాయలు, వాటన్నిటిని ఒకదాని తర్వాత ఒకటి కాల్చుకొని తిన్నారు.

వాళ్ళు నీళ్ళు తాగుతుండగా మక్కజొన్న చేను యజమాని వచ్చి ఒకరి ఒకరిని పబ్బబరిగెతో వాయించాడు. ఆ దెబ్బలకు తాళలేక మనిషికో దిక్కు పారిపోయారు. అయినా దేవయ్యకు బుద్దిరాలేదు. నాలుగు రోజుల తర్వాత దొంగతనానికి సోపతిగాళ్ళను ప్రోత్సహించాడు. వాళ్ళు దొంగతానికి రాలేమన్నారు.

''పిరికి సన్నాసుల్లారా! నేను మక్కకంకులు తెస్తాను. మీరు కట్టెలు తీసుకురండి'' అని చెప్పి వెళ్ళి అరగంట తర్వాత తువ్వాళ నిండా కంకులు మూటగట్టుకొని తెచ్చాడు.

మల్లయ్య కంకులు కాల్చాడు. అన్నీ కాల్వడం అయిన తర్వాత వాళ్ళు కంకులు ఒలుచుకొని బక్కుతూ దొరలను తిట్టుకుంటూ, వాళ్ళనుద్దేశించి వెకిలిపాటలు పాడుతూ నవ్వుకోసాగారు.

ఆ మొక్కజొనో చేను యజమాని సురేశ్ బాబు తన చేనులో జరిగిన దొంగతనం, కంకులులేని మక్కకర్రలను చూచి గ్రహించాడు. కంకులు బుక్కుతున్న ఈ పిల్లలవద్దకు వచ్చాడు. వాళ్ళు తిడుతున్న తిట్లు, పాటలు విన్నాడు. కోపంతో చిందులువేస్తూ చేతిలో ఉన్న కట్టెతో ఒకడిని కొట్టబోయాడు... వాడు చటుక్కున లేచి పారిపోయాడు.

అందరూ తూనీగల్లాగ చెల్లాచెదరై పారిపోయారు. దేవయ్య దొరికిపోయాడు. వాని జుట్టుపట్టుకొని వీపులో కొట్టాడు, తొడపాశం పెట్టాడు, చెంపలు పగులగొట్టాడు. అయినా కోపం తీరలేదు. కట్టెతో తలమీద బలంగా కొట్టాడు.

దేవయ్య స్పృహతప్పి ఇసుకలో పడిపోయాడు. సురేశ్‌బాబు నలువైపులా చూశాడు. ఎవ్వరూ కనిపించలేదు. పిల్లలు అప్పటికే చాలాదూరం పారిపోయారు. అతడు గబగబా అక్కడినుండి ఇంటి ముఖం పట్టాడు. ఆ ఒర్రెకు ఇరువైపులా దట్టంగా చెట్లుండడంవల్ల సురేశ్ బాబు ఇంటికి వెళ్ళి నేరంచేయనివాడిలా నిశ్చింతగానే ఉన్నాడు.

చీకటిపడ్డా కొడుకు రాకపోవడంతో దుర్గయ్యవాని సోపతిగాళ్ళ ఇల్లిల్లు తిరిగి ''మావాడు మీతో రాలేదా? ఎక్కడికి వెళ్ళాడు. ఎప్పుడు వస్తాడు'' అని అడిగాడు. అందరూ తమకు తెలియదనే చెప్పేశారు.

''పోయేటప్పుడు మా అందరితో పాటే వచ్చాడు. కాని పొద్దుగూకేయాళ్ళ మేము ఊళ్ళెకు వచ్చేటప్పుడు మాతో వచ్చి కలువలేదు. మేము ఎడ్లను కొట్టాలల్లో తోలి ఇంటికి వచ్చినాము'' అని అందరూ ఒకేరకంగా చెప్పిండ్రు.

''వాడు కాసే ఎడ్లు ఎటుపోయినై'' అడిగిండు

దుర్గయ్య.

''మా ఎడ్లతోనే వచ్చినయి. కొట్టముల తోలి వచ్చి నము'' అన్నాడు మైసయ్య.

''నీ కొడుకు దొంగతనం చేయడంలో శూరు మారు ఖాన్. అక్కడ అన్నీ చేన్లేనాయె. ఏ చేన్లకు పోయిండో ఏందో'' అన్నాడు మైసయ్య తండ్రి కొండయ్య.

దుర్గరాజు ఆ మాటలు విన్నా విననట్టే మౌనంగా ఉండి రాజేంద్రబాబు కొట్టమువద్దకు వచ్చి అక్కడ ఏడుకున్న ఎడ్లకు గడ్డివేసి పనుగడి కట్టేసి ఇంటికి కాకుండా దేవయ్య జాడలో బయలుదేరాడు.

అమావాస్య దగ్గరపడుతున్న రోజులు కావడంవల్ల చీకటిగానే ఉంది.

నడుస్తూనే ఉన్నాడు దుర్గరాజు అతనికి విచారంగానే ఉంది. ఆలోచనలుఒకదాని తర్వాత ఒకి మనసును ఆక్రమించుకొంటున్నాయి... దొంగతనం చేశాడా తన కొడుకు... దొంగతనం చేస్తూ దొరికిపోయాడా... లేక పాముకరిచిందా... పోయినేడు జగ్గయ్యను పాము కరిస్తే చేనులోనే చనిపోయిన విషయం యాదికి వచ్చి మనసు విలవిలలాడింది.

నాగులపంచమికి పుట్టలో పాలుపోసి రక్షించు నాగదేవుడా! అని తాను, తన భార్య ప్రతి సంవత్సరం మొక్కుతూనే ఉన్నాంకదా!... ఆ విషయం యాదికి రాగానే పాముకరిచి ఉండకపోవచ్చునని మనసులో సమాధానపడ్డాడు.

పాము పగ అంటారు. కాని పాములు ఉత్త పుణ్యా నికే కరుస్తాయా వాటిమీద పొరపాటున అడుగుపడితే, లేకపోతే కొడితే ఎదురుతిరిగి కాటేస్తాయి. కాని ఈ దొరలు పాములకంటే ప్రమాదం. ఎంత రాక్షసంగానైనా శిక్షిస్తారు. అలా ఆలోచిస్తూ, ఆలోచిస్తూ ఎడ్లు మేపే బూముల్లో వెదకసాగాడు.

చెట్లచాటుకు. పుట్టలచాటుకు వెదికాడు. అరగంట గడిచింది... గంట గడిచింది. ఎక్కడా కనిపించలేదు. అతడు వెదకుతూ వెదకుతూ ఒర్రెలో ప్రవేశించి కొంత దూరం వెళ్ళేసరికి నీటిపక్కన ఇసుకమీద దేవయ్య పడి ఉండడం గమనించాడు. గబగబా వెళ్ళి తట్టి చూశాడు. ముక్కువద్ద చేయిపెట్టి చూశాడు. శ్వాస ఆడుతూ ఉంది. వీపంతా పునికి చూశాడు. చెంపలు నిమిరి చూశాడు. అంతటా దెబ్బలబొబ్బలే. తలమీద ఉబ్బిన భాగం అతని చేతికి తాకింది.

ఇంతదెబ్బ ఎలా తాకింది... ఎవరైనా రాయి విసిరితే వచ్చి తాకిందా... పరిసరాలు గమనించాడు... అంతా ఇసుకే, రాళ్ళు కనిపించలేదు... కొంతదూరంలో మక్క కంకుల తంపి కనిపించింది. మక్కకంకులు వీడే దొంగ తనం చేశాడా. కొండయ్య అన్నమాట నిజమేనా. కంకులు వీడే కాల్చుకొని బుక్కాడా.

అక్కడక్కడ పడివున్న మక్కబెండ్లు కనిపించాయి. ఒక్కడే ఇన్ని కంకులు బుక్కి ఉండడు. బుక్కినోళ్ళం దరూ పారిపోగా వీడు దొరికిపోయాడేమో!... అంతే అయివుంటుంది... కట్టెతో కొట్టిండేమో... ఎవడో కసాయి దొర.

దుర్గయ్య ఒర్రెలోని నీళ్ళుతెచ్చి దేవయ్య ముఖం మీద చల్లిండు. దేవయ్య కొంచెంసేపయిన తర్వాత మెల్లగా కళ్ళుతెరిచిండు. తండ్రిని చూచి బావురుమని ఏడుస్తూ అతనిని గట్టిగా అలుముకున్నాడు. అతడు కొడుకును భుజానవేసుకొని ఇంటివైపు బయలు దేరాడు.

''నాయిన్నా ఏమైందే నాకు...'' దేవయ్య గొంతు వణుకుతూనే ఉంది.

''నాకేం తెలుసురా! ఎవరు కొట్టిండురా నిన్ను''

''వాడెవ్వడో... కొట్టునాయిన్నా... వాణ్ణి కొట్టు... నువ్వు...''

దుర్గరాజు నడుస్తున్నాడు. ''నొప్పి... తలనొప్పి... వీపు... చెంపలు... ఎవడు కొట్టిండు నన్ను'' దుర్గయ్య ఇంటికి చేరిండు.

మంకమ్మ మొగని భుజంమీద ఉన్న దేవయ్యను చూచి ''ఏమైంది కొడుక్కు'' అంటూ దగ్గరకు వచ్చింది.

దుర్గయ్య కొడుకును మంచంమీద పడుకో బెట్టిండు. చాలా దూరం నుండి కొడుకును మోసుకు రావడంవలన అలసిపోయి నేలమీద కూర్చుండి గోడకు ఒరిగాడు.

''దేవయ్య! ఏమైంది కొడుకా'' అంది మంకమ్మ పిల్లవాని వాలకం చూసి.

దేవయ్య బిత్తర చూపులు చూస్తూ, చేతులు వంకర టింకరగా ఊపాడు. మంకమ్మ పల్లెములో అన్నంకూర తెచ్చి దేవయ్య తినమంది.

''మక్కకంకి... నాదేది...'' లేవబోయి పడిపోతూ అన్నాడు.

''రోజూ సవ్యంగా మాట్లాడెటోడు. ఈరోజేంటి. వీడు వంకరటింకర మాట్లాడుతున్నాడు. దయ్యాం పట్టిందా వీన్ని...'' అంది మంకమ్మ.

''దయ్యాంలేదు. భూతంలేదు. ఈ దయ్యపు

ముండాకొడుకు ఎవరిచెన్లనో దొంగతనం చేసి నట్టుంది... వాడెవడో కనిపెట్టి వీన్నికొట్టినట్టుంది... తలమీదనైతే ఇంతుబ్బింది...''

''తలమీదనా...'' మంకమ్మ కొడుకు తలనిమిరి అంది.

''రక్తం కారలేదుకాని గట్టిదెబ్బనే తగిలింది. మెదడు దెబ్బతిన్నదా ఏంది పోరంది... ఎవరు కొట్టి ఉంటరు''

దుర్గయ్య ఏమి మాట్లాడకుండా ''ఆడి పోరగండ్లు తిన్నరా'' అన్నాడు.

''తినలేదు. తమ్మున్ని వెతుకతం అని ఊళ్ళోకి పోయిండ్రు''

''పిలుచుకురా పో''

''ఎటుపోయిండ్లో... ఎటని పోవాలె నేను. పోయి నోళ్ళు అటే పోతరా ఏంది. కొంచెంసేపయిన తర్వాత వాళ్ళే వస్తరు. నువ్వు తింటవా'' అంది.

''వాళ్ళిద్దరూ రానీ...'' అని దుర్గయ్య నేలమీదనే మేనువాల్చాడు.

ఇంతలో చిన్నపిల్ల రేణుక ''అవ్వా! తమ్ముడు వచ్చి నాడే'' అనుకుంటూ ఇంట్లోకి పరుగెత్తి వచ్చింది.

''వచ్చిండు బిడ్డా! అక్కేది'' అంది తల్లి.

''అక్క హనుమాండ్ల గుడి దిక్కుపోయింది. నేను ఎల్లమ్మ గుడి దిక్కుపోయిన''

''తింటవా బిడ్డా నువ్వు. అన్నం పెట్టనా'' అంది తల్లి.

''తమ్ముడు తిన్నాడే'' అంది రేణుక, దేవయ్య దగ్గ రకుపోయి చూసింది. ఎటో చూస్తున్నడేమో తమ్ముడు ''వీనికి దయ్యంపట్టిందా...'' అంది ఆ పిల్ల.

''నువ్వట్ల మాట్లాడకు వానికి తలమీద దెబ్బ తాకింది. రేపు తెనుగుసాయబు దగ్గరకుపోతే ఏదైనా మందిస్తడు. ఆ మందులతాత దెబ్బలకు మంచి మందే ఇస్తడు''

''నేను ఆ మందుల తాతను రమ్మనన్నా వాళ్ళింటికి పోయ్యి''

## విధ్వంసం

గరుడ బస్సు గడగడలాడిపోయింది
డీలక్స్ బస్సు దిమ్మదిరిగిపోయింది
ప్రజల ఆస్తి అంటూనే పెట్రోల్ పోశారు
దిగు, దిగు అంటూనే దహించి వేశారు
సమయానికి వైద్యం అందక-దవాఖానా చేరక
సమయానికి దఫ్ తరేకు పోక - సగటు
మనిషి ఇబ్బందులేవీ తీరక
అల్లరి మూకల ఆటవిక చేష్టల బజారులైట్లు,
బస్సు అద్దాలు, ప్రభుత్వ ఆస్తులూ ధ్వంసం,
ధ్వంసం
మతిలేని వాని చేతిలో రాయి-గతి తప్పిన
ప్రగతిరథాల పురోగతి
సర్వనాశనం-అంతటా భయం భయం
మహాత్ముడెక్కడ-మారణ హోమం
ఆపేదెక్కడ...?

## ఘనులు

అభినవదుశ్శాసన కీచకులు-
వసుధవలువలు వలుస్తున్నారు
కాకి రాయి కొండల్ని కాకులు భోంచేస్తున్నాయి
ఏటిలోని ఇసుకను ఎలుకలు తవ్వేస్తున్నాయి
అడవిలో ఎర్రచందనం అదృశ్యమైపోతున్నది
శతాబ్దాల కల్పవృక్షాలు కలపగా మారుతున్నవి
స్వార్థపరుల కుతంత్రాలకు ప్రకృతే వికృతౌతున్నది
ధృవాలు వేడెక్కి సునామీలు వచ్చేస్తున్నాయి
సాగరాలేకమై దేశాలనే కబళిస్తున్నాయి
కరువు వరదలతో జన జీవనం కల్లోలమౌతుంది
మేలుకో మానవా మేలుకో...
వనరులు కాపాడుకో, వరాలు అందుకో
అత్యాశ వదులుకో, జీవించడం తెలుసుకో...

వై.కె.మూర్తి

''ఆ తాత నిన్ననే ఊరికిపోయిండు. పోయ్యే టప్పుడు బజారులో కనిపించిండు. ఎవరో అడిగితే రేపు శనివారం వస్తనని చెప్పిండు''

భూదేవి రానే వచ్చింది. వస్తూనే తమ్ముని దగ్గరకు వెళ్ళి తమ్మున్ని చూచి కన్నీల్లు పెట్టుకుంది. ఆమె మనసు చాలా సున్నితం... రేణుక అలాకాదు గడు గ్గాయిగా పేరుపొందింది. కష్టాలను తట్టుకునే శక్తి భూదేవికి లేదని, రేణుకది గట్టి గుండె అని ఎదురింటి పోచయ్యతాత అంటనే ఉంటడు.

మంకమ్మ అంది... ''ఏమయ్యో! లెవ్వు పిల్లగాండ్లి ద్దరు వచ్చిండ్రు. మీ ముగ్గురికి తిండిపెడతా, మీరు తిన్నంక, వానికి బతిమిలాడి తినిపిస్తా''

దుర్గరాజు లేచి కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చి కంచం ముందు కూర్చున్నాడు. పక్కనే రేణుక, భూదేవి కూర్చున్నరు. మంకమ్మ అందరికీ పల్లాలో అన్నంపెట్టి వేడి వేడి అన్నంలో పప్పుచారు పోసింది. ముగ్గురు భోజనాలు చేసేశారు. మంకమ్మ దేవయ్యను లేపి పప్పుచారు కలిపిన అన్నంముద్ద తినిపంచబోయింది.

''నేను... నేనే తింట... నేనేమి చిన్న పిల్లోడినా'' అన్నాడు ముఖం వంకరగా తిప్ప బెదిరి బెదిరి చూస్తూ.

మంకమ్మ దేవయ్య చేతికి అన్నంపల్లెం ఇచ్చింది. వాడు అయిదారు ముద్దలు కోతిలా మింగేసి పల్లెము కిందపడేశాడు. మిగిలివున్న అన్నం చెల్లాచెదరుగా పడిపోయింది.

''ఏమైందిరా నీకు పల్లెంకింద పారేసినావు'' అంది మంకమ్మ కోపంగా.

దేవయ్య ఎంగిలిచేతిని అంగీతో తుడుచుకొని మంచం వద్దకుపోయి అందులో కూలబడి మేను వాల్చాడు.

❖ ❖ ❖

రేణుక చనిపోయి రెండు నెలలయింది. మంకమ్మ కళ్ళముందు మంటలు అంటుకొని కాలిపోతున్న రేణు కనే కదలాడసాగింది. చలి భరించలేక మంటదగ్గర చలికాగుతుండగా, నైలాను ఓని అంటుకొంది. రేణుక భయంతో పరుగెత్తడంతో మంటలు మరింత విజృం భించడం, అక్కడ మంటకాగుతున్నవారు.

మంటలకు భయపడి ఏమీ చేయకపోవడం, ఆ పిల్ల ఒళ్ళంతా కాలిపోవడం నిమిషాల్లో జరిగిపోయింది. జీపులో సిరిసిల్లకు తీసుకుపోతుండగా మార్గమధ్యము లోనే ఆ పిల్లమరణవేదన పొందుతూ తుదిశ్వాస విడి చింది. ఆ జ్ఞాపకాలు ఆమెను నిత్యం వేదిస్తూనే ఉన్నాయి. తిండి సరిగా తినడంలేదు, ఆమె బాగా చిక్కి పోయింది.

దేవయ్యకు తెనుగు సాయబు వైద్యంవల్ల తలమీద దెబ్బ రెండువారాల్లోనే తగ్గిపోయింది. కాని లోపల మెదడు నరాలు మాత్రం బాగుపడ్డట్టులేదు. అందుకే వాని బిత్తర చూపులు, పొంతనలేని మాటలు, పిచ్చి చేష్టలు ఇంకా అలాగే కొనసాగుతున్నాయి.

దుర్గయ్య దేవునిమీద భారం వేసి కాలం గడుపు తున్నాడు. పనికివెళ్ళడం, పనిచేయడం, డబ్బె సంపా దించడం, తినడం, పండడం... సంతోషం లేదు... సరదాలేదు.

మంకమ్మ రేణుకను తలుచుకొని వలవల ఏడు స్తూనే ఉంది. ఆమె ఆరోగ్య పరిస్థితి క్రమక్రమంగా క్షీణించసాగింది. ఆ సంవత్సరం వేసవి కాలంలో విష జ్వరాలు ఆ ఊరిని వణికించాయి. ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్న మంకమ్మకు విషజ్వరం సోకడంతో రెండు మూడు రోజుల్లోనే ఆమె ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి.

విషాదంవెనుక విషాదం చుట్టుముట్టడంవల్ల దుర్గ రాజు మనసు బండబారిపోయింది. కూలిపనికి పోతు న్నాడు, వస్తున్నాడు, తింటున్నాడు, పంటున్నాడు. కాలం గడిచిపోతున్నది.

భూదేవి రోజుకు వెయ్యి పన్నెండు వందల బీడులు చేస్తున్నది. డబ్బు సంపాదిస్తున్నది, వంటచేస్తూ తండ్రికి, తమ్మునికి వడిస్తూ వాళ్ళిద్దరికి తనే దిక్కు అన్నట్టు ధైర్యంగా ఉండసాగింది. తండ్రికి ధైర్యం నూరిపోస్తున్నది.

ఎంతో సున్నిత మనస్కురాలనుకున్న భూదేవి ధైర్యాన్ని చూచి చుట్టుపక్కలవాళ్ళు ఆశ్చర్యపోతు న్నారు. సృష్టిలో జరిగి వింతలంటే ఇవేనేమో!

''అందరూ ఈ లోకమును వదిలిపోవువారే. ఎవరు ఇచట శాశ్వతముగా ఉండువారు లేరు...'' ఎవరో పాడగా విన్న ఆ పాట భూదేవి కూడా అప్పుడప్పుడు సోపతిగాళ్ళ దగ్గర పాడుతుంది.

కాలచక్రం తిరుగుతూ ఉంది. దుర్గయ్య వేదాంతిలా మారిపోయాడు. దేవయ్య పిచ్చి మరింత ముదర సాగింది.

❖ ❖ ❖

భూదేవికి పెళ్ళయి ఆరునెలలయింది. అబ్బాయిది విలాసాగర్. వాళ్ళకు పెంకుటిల్లు, చెరువు కింద ఎకరం నర పంటపండే భూమి ఉంది. అబ్బాయికి తల్లిదండ్రు

లున్నారు. భూదేవి ఆడబిడ్డకు అంతకుముందే పెళ్ళయింది.

ఆమె అత్తగారి ఊరు నర్సింగాపురం. అబ్బాయి తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటారు. ఇంటిపని లేనప్పుడు కూలినాలి చేసుకుంటారు. చేతిలో

## వర్తమాన పదాలు

నేటి తాజా కబురు
రేపటికి చద్దివార్తే!
ఒకనాటికి
అదే చరిత్ర!?

వాళ్ళు నూతన దంపతులు
ఇనుము-అయస్కాంతమే!
పిదపే
ఉప్పూ-నిప్పూ!?

ఐ.ఏ.ఎస్‌లకు
శిక్షణా కేంద్రమేకాదు!
ముస్సోరి
పెళ్ళిళ్ళ వేదిక కూడా!?

ప్రతి మనిషికీ
జీవితాలు రెండు!
ఒకటి 'వ్యక్తి'గతం
రెండోది 'వృత్తి'గతం

వాళ్ళిద్దరూ
ఆలూమగలే!
నిత్యం పోట్లాటే
'టామ్ అండ్ జెర్రీషో'లా!?

మొగడ రామకృష్ణ

డబ్బుంది. ప్రతిరోజు సాయంత్రం భార్యాభర్తలిద్దరూ కూర్చుండి ఏవైనా చిరుతిండ్లు తింటూ, కల్లుతాగుతూ ముచ్చట్లు చెప్పుకుంటూ కాలం గడుపుతారు. అదీ వాళ్ళ దినచర్య, అదృష్టవంతులు.

భూదేవి భర్త సంవత్సరం నుండి గోదావరి ఖనిలో బొగ్గుగనిలో కోల్‌కట్టర్‌గా పనిచేస్తున్నాడు. భూదేవి కూడా భర్తతోపాటు గోదావరిఖనికి వెళ్ళిపోయింది.

ఇక్కడ దుర్గరాజుకు వంట బాధ్యత పెరిగింది. వంట చేశాక కొడుక్కు తిండిపెట్టి, తాను తిని పనికి పోయే ముందు సామాన్ల గదికి తాళం వేసి వెళ్ళిపోతాడు. ఆ గదిలోనే ఆ పేదవాని చిన్నపాటి సిరిసంపదలు, ఇక గది ముందు హాలులో రెండు మంచాలు, పాతబట్టలు, పాత సామాన్లు ఉంటవి.

దేవయ్య ఆ హాలులోనే పిచ్చిపిచ్చిగా తిరుగుతుంటాడు. ఒక్కొక్కసారి గంతులు వేస్తుంటాడు. దర్వాజ దాటి బజార్లకు వస్తుంటడు. హాల్లోకి వెళ్తుంటాడు. రాళ్ళు విసురుతుంటాడు. మన్ను ఎగజల్లుతుంటాడు. ఒక్కొక్కసారి తిట్ల వర్షం కురిపిస్తాడు. ఒక్కొక్కసారి నవ్వుతుంటాడు, అలసిపోయాక మంచంలోపడిపోయి గుర్రుతీస్తుంటాడు.

వాడు ఈలోకంలో ఉన్నా, వేరే లోకంలో ఉన్నట్టు వాని ప్రవర్తన కనిపిస్తుంది. తండ్రి ఇంటి వద్ద వున్నప్పుడు ఆ పిచ్చిచేష్టలను అతడు భరిస్తాడు, లేనప్పుడు ఇల్లు భరిస్తది.

❖ ❖ ❖

ఆరోజు సాయంత్రం దుర్గయ్య ఇంటికి వచ్చిండు కిట్టయ్య.

కిట్టయ్య, దుర్గయ్య చిన్నప్పటి సోపతిగాళ్ళు. కిట్టయ్య ఊళ్ళో ఉన్న అయిదవతరగతి వరకు చదువుకున్నాడు. దుర్గయ్య వాళ్ళు వీళ్ళకంటే పేదవాళ్ళు. అతడు బడికిపోలేదు. ఊళ్ళో చదువుపూర్తికాగానే సిరిసిల్లలో చదువుకుంటానన్నాడు కిట్టయ్య.

"మనకెందుకురా చదువు... మనకున్న కొద్దిపాటి పొలం దున్నుకుందాం. దానికి తోడు ఇంకో ఎకరం కౌలుకుతీసుకుందాం..." అని తండ్రి కిట్టయ్యను వ్యవసాయంలోకి తెచ్చిండు.

కిట్టయ్య పొలం పనులు బాగానే చేసినా, ఆ పొలంలో పండే పంట ఇంటి ఖర్చులకు సరిపోయినా ఎదగడానికి అవకాశం లేదనుకుని సౌదీకి వెళ్ళడానికి ప్రయత్నంచేసి అనుకున్నది సాధించిండు.

మొదటిసారి సౌదీకి వెళ్ళివచ్చాక పెళ్ళయింది. అలా

వస్తూపోతూ ఎనిమిది పర్యాయాలలో పందొమ్మిది సంవత్సరాలు సౌదీలో పనిచేసి బాగా డబ్బు గడించి వచ్చిండు.

అనుభవం పెరిగింది, జ్ఞానం పెరిగింది. మనిషిలో ఉత్సాహం ఉంది. పట్టుదల ఉంది. అనుకూలవతియైన భార్య ఉంది. చదువుకుంటున్న పిల్లలున్నారు. ఇండియాకు తిరిగి వచ్చాక సినిమా స్టూడియోలో పనిచేస్తున్న అతని బావమరిది అమర్‌నాథ్ సహకారంతో పట్నంలోనే కిరాణం అండ్ జనరల్ స్టోరు ప్రారంభించిండు.

కిట్టయ్య పేరును కృష్ణగా మార్చి ప్రభుత్వ గజిట్‌లో ప్రకటింపజేసింది. అమర్‌నాథే. కృష్ణ కిరాణ అండ్ జనరల్ స్టోర్ అని పేరు పెట్టింది ఆయనే. కృష్ణకు సౌదీలో షాపులో పనిచేసిన అనుభవం ఉండనే ఉంది.

పెళ్ళి సందర్భములో అత్తవారు ఇచ్చినప్లా( )లో ఇల్లుకట్టుకున్నాడు. మిగిలిన ఖాళీస్థలంలో రేకులతో అయిదు గదులు కట్టించిండు. వ్యాపారం వృద్ధిలోకి వస్తున్నది. చాకచక్యంగా షాపు నడపడంలో భార్య సుమిత్ర సహకారం అందిస్తున్నది.

ఆ షాపునానుకొని హోటల్ ఉంది. అది ఆమె అన్న అమర్‌నాథ్ బావమరిది సురేంద్రది. అతడు ఈసారి ఎమ్.ఎల్.ఏగా గెలిచిండు. భవనాన్ని అద్దెకు తీసుకుంటూ సమస్త వస్తు సామాగ్రితో హోటల్ నిర్వహణను అమ్మాలనుకుంటున్నాడు.

సుమిత్రకు ఆ విషయం తెలిసి మనమే ఆ హోటల్ నడుపుకుందామని భర్తతో అంది. అతడు సరేనన్నాడు. అన్న సహకారం కోరింది. అతడు సురేంద్రను ఒప్పించి కృష్ణకు హోటల్‌ను అప్పగించిండు. నిర్వహణ సలహాలు అందించిండు.

బావమరిది సలహానుసరించి హోటల్లో పనిచేయడానికి తన గ్రామస్తులను పెట్టుకోవాలనుకున్నాడు. కొద్దిరోజుల క్రితమే కొన్న జీపులో స్వగ్రామానికి వచ్చిండు. ముగ్గురు తమ కొడుకులను వారం పది రోజుల్లో తోలిస్తమన్నారు. పక్కింటి కొమురయ్య మాత్రం తన కొడుకు వీరేశంను వెంటనే పంపిస్తనన్నడు.

## శ్రమదానం!

ఒక పువ్వు కాయగా
కాయ ఫలంగా
ప్రతిఫలించడానికి
శ్రమించింది చెట్టు!
ఒక పిండం జీవిగా
బాల్యం యవ్వనంగా
వ్యక్తిగా మార్చడానికి
కష్టించింది తల్లి!

## 'బాప్'రే బాప్!

సౌమ్యత
ఐక్యత
అహింస
నిజాయితీ
బాప్ రే బాప్!
అన్నీ ఆదర్శాలే
అందుకే ఆయన మహాత్మ!!

## ఆడతనం

ఆడతనం
సున్నితమంటారు!
మరి ఆడాళ్ళే
సాటి ఆడదాన్ని
టీవీ ఛానెళ్ళ సాక్షిగా
కొట్టి కొట్టి చంపేశారు
అదే తన కన్నకూతురైతే
అలా చేసేవాళ్ళా
మనసు గదుల్లో
ఎందుకంత వేర్పాటు??

మరో భారతీయుడు

అతడే దుర్గరాజును గురించి అతని గత రెండు మూడు సంవత్సరాల ఇంటి పరిస్థితుల గురించి వివరించి చెప్పిండు.

దుర్గరాజు అంటే కృష్ణకు చిన్ననాటి నుండి ప్రేమ, చొరవ... అతడు ఒప్పుకుంటే అతనికి సహాయం చేసినట్టు ఉంటుంది. తన అవసరం తీరినట్టు ఉంటుంది... ఏదిఏమైనా అతని కష్టసుఖాలు విచారించి అతడు తనతో రాకపోయినా ఏదైనా కొంత ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకున్నాడు.

కృష్ణరాగానే దుర్గరాజును కౌగిలించుకున్నాడు. నీ ఇంటి విషమయాలన్ని తెలుసుకున్నాని కృష్ణ అనగానే దుర్గరాజు బావురుమని ఏడ్చాడు. కృష్ణకూడా దుఃఖ పడుతూనే మిత్రున్ని ఊరడించిండు.

❖ ❖ ❖

కృష్ణ జీపు డ్రైవ్ చేస్తున్నాడు. ఆ జీపు హైదరాబాద్ వైపు పరుగెత్తుతూ ఉంది. పక్కనే దుర్గరాజు కూర్చున్నాడు. వెనకసీట్లో వీరేశం, దేవయ్య పక్కన కూర్చున్నాడు. దేవయ్య జీపులో కూర్చున్న పది నిమిషాలల్లోనే నిద్రలోకి జారుకున్నాడు. వీరేశం ఆరోజు దినపత్రిక పట్టుకొని అక్కడక్కడ చదువుతున్నాడు.

“దేవయ్యను మెంటల్ హాస్పిటల్లో చేర్పిస్తే బాగుపడే అవకాశాలు ఉన్నాయి” అన్నాడు కృష్ణ.

“వాడు బాగుపడుతడంటవ?”

“మా స్నేహితుని కూతురొకామె గచ్చులో జారి పడింది. పెద్ద దెబ్బ తాకింది. ఆమెకూడా ఇలాగే చేసేది. మెంటలాస్పిట్లో ఆరేడు నెలలు వైద్యం జరిగాక మంచి

## రేషన్

ఒకచేత
రేషన్
మరోచేత
పరేషాన్
కంది
లొల్లి ముందు
ఉల్లి
మేలు అందు
అప్పుచేసి
పప్పుకూడు
నిజంచేసే
కందిపప్పు
అన్నమైతేనేం
సున్నమైతేనేం
రేషన్‌లో ఇచ్చిందే
పరమాన్నం

బద్ది నాగేశ్వరరావు

## జాబిలమ్మ వ్యధ

భూమి పని
పట్టేశాడు
ఇక నన్ను
చుట్టేస్తున్నాడు
చల్లదనం
ఇచ్చినందుకు
కొల్లగొట్టే
కృతఘ్నుడు
దాటేసాడు
మానవుడు హద్దు
ఒక్కసారిగా నాకు
నాసా గుద్దు
అయ్యో మానవుడా
ఉందోయ్ నాలోనీరు
యుగాలుగా చేస్తున్నా మేలు
అందుకే కారుస్తున్నా కన్నీరు

గయింది. ఆమెది ఒక సంవత్సరం చదువు చెడిపోయింది. దేవయ్యకూడా మంచిగయితడు. నువ్వు ధైర్యంగుండు''

''వాని ఆరోగ్యం బాగుపడితే... నాకింక ఏ దిగులూ లేదు. చచ్చిపోయిన పెళ్ళాంబిడ్డలు ఎలాగూ తిరిగిరారు. పెద్ద బిడ్డ భూదేవి మంచి ఇంటికి కోడలయింది. అది మంచిగనే బ్రతుకుతదని బరోసా ఏర్పడ్డది... ఇక నీదయవల్ల మేము కూడా...''

''ఏమిటి దుర్గన్నా!... అంత పెద్దమాటలు... మనం సోపతిగాళ్ళం. నీకష్టం వినగానే నా మనసు నీళ్ళు నీళ్ళు అయింది తెలుసా! నీకు వచ్చిన కష్టాలు ఏ శత్రువుకు కూడా రావద్దు.

మనం చిన్నప్పుడు వేములవాడ జాతరకు పోయి గోకుల్ టాకీసుల శ్రీకృష్ణ కుచేల సినిమా చూసినం యాదున్నదా ఆ కృష్ణభగవానుడు తన చిన్ననాటి మిత్రుడు దరిద్రంతో బాధపడుతుంటే తన సిరిసంపద లిచ్చి ఆదుకున్నాడు. సోపతంటే అదేనే దుర్గన్నా!

నేను కృష్ణ భగవానున్ని కాపోయినా సోపతికి విలవిచ్చెటోన్ని. ఏదో ఆ దేవుని దయవల్లనో, అదృష్టంవల్లనో నా తల్లిదండ్రులు చేసిన పుణ్యమో, సౌదీకి పోయి లక్షలు ఆస్తి సంపాదించిన. ఓ ఇల్లుకూడా హైద్రాబాద్‌లో కట్టుకున్నా. ఇంటిపక్కనే అయిదు గదులు కట్టించిన, అన్ని వసతులున్నాయి. ఇంటికి దగ్గర్లోనే షాపు, హోటల్ ఉన్నాయి.

మీ అందరికి తిండి, బట్టలు ఇవ్వడమే కాకుండా నాకు వచ్చే లాభాలలో రూపాయికి ఇరవై పైసలు నావద్ద పనిచేసే వాళ్ళకు ఇవ్వాలనుకుంటున్న. వ్యాపారం పెరిగితే లాభాలు ఎక్కువ వస్తే అందరం లాభపడతాం అందుకే అందరం కలిసికట్టుగా బాధ్యతగా పనిచేస్తూ ఉండాలి.

దుర్గన్నా, నువ్వు జీతగాడివి కాదు నా సోపతోనివి... దుర్గన్నా! నేను చిన్ననాటి సోపతిగాన్నే నేనేం మారలేదు. లక్షలు సంపాదించాలని నాకేం గర్వంలేదు... నీలాంటి మిత్రునికి సహాయంచేసే అవకాశం వచ్చినందుకు నాకు ఒక విధంగా సంతోషంగా ఉంది.

''సోపతి గురించి మన ఊరి కిషన్‌రావు సారు రాసిన పాటవింటవ''

''కిషన్‌రావు సారా! అంటే భూమయ్య దొర కొడుకా''

''అవును ఆయనే మధ్య మా షాపుకు వచ్చిన ఓ లాయర్‌సారు తన మిత్రునికి పత్రికలో వచ్చిన ఈ పాట

## నేను

నా వంటినిండా
అక్షరాలే
హృదినిండా
పదబంధ ప్రయోగాలే
నా ఉచ్ఛ్వాశం
ఉరికే కడలి తరంగం
నా నిశ్వాసం
ఉరికే కడలి తరంగం
నా నిశ్వాసం
నీకు స్ఫూర్తిని వెలిగించే నిప్పు కణం
నడిచే కవితను నేను
ప్రవహించే చైతన్యం నేను

మోపూరు పెంచల నరసింహం

వినిపించిండు... నేను కూడా విన్నా. మన ఊరి సారాయె. ఆయనంటే నాకు ఇష్టమేనాయే ఆ పత్రికలోని ఆ పాటను దగ్గరే ఉన్న జిరాక్స్ సెంటర్‌లో జిరాక్స్ తీయించుకొని తర్వాత మా బావ సహాయంతో సంగీతంతోపాటను రికార్డు చేయించిన ఆ పాట వింటే స్నేహమంటే ఏమిటో, దాని విలువేమిటో తెలుస్తుంది. విను మరి...'' కృష్ణ చేతివేలితో బటన్ నొక్కగానే పాట ప్రారంభ మయింది.

స్నేహమేరా ఉన్నతం...

కలిమిలో లేమిలో... కలిసి ఉందామురా, సిరులున్న లేకున్నా-చెలిమి ముఖ్యమురా, కలిమితో రాలేదు-కలిమితోపోలేము, వట్టి చేతులతోనే-మట్టిపైవాలాము, వట్టి చేతులతోనే- మట్టిలో కలిసేము, బ్రతకడమే కాదురా-బ్రతుకునివ్వాలిరా, బ్రతుకులో మెరుగైన-పనులు చెయ్యారలిరా, చెలిమి కన్నను మిన్న-కలిమి కాలేదురా, మంచి చేసిన మంచి-వెన్నంటి వచ్చురా, సహకారనైజమే-ఉన్నతములెమ్మురా, కష్టాలు వచ్చినా-కలిసి మనముందాము, చెలిమిలో కష్టాలు- తొలగించుకుందాం, కలిమిలో లేమిలో -కలిసి ఉందాముర. ■